క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా అధికారి గోవిందనాయక్

ఉయ్యాలవాడ : మండలంలోని గోవిందపల్లె గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా ప్రత్యేక అధికారి గోవింద్‌నాయక్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఎంపీపీ నిధుల నుంచి రూ. 9లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డు, డ్రైనేజీ, జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షలతో నిర్మించిన చెత్త సంపద కేంద్రం , ఎంపీ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మౌలిక వసతులు, తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శి సతీ ష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

దొర్నిపాడు: సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పనులను వలంటీర్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. క్యాస్ట్, ఇన్‌కం, ఇతర పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే అధికారులకు అప్‌లోడ్ చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

నేడు గుండుపాపల సురక్ష

మండలంలోని గుండుపాపల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు.

రూ.17.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు



రెడ్డిపల్లెలో సాగుతున్న సీసీరోడ్డు పనులు

రుద్రవరం: మేజర్ గ్రామ పంచాయతీ రుద్రవరం మజరా గ్రామమైన రెడ్డిపల్లెలో దాదాపు రూ.17.50 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచు బైరి విజయలక్ష్మి ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలు ఏర్పడటంతో ప్రజలు, వాహనాల రాక పోకలకు ఇబ్బందులు పడేవారు. కొద్ది రోజల క్రితం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పర్యటించిన సందర్భంగా గ్రామస్తులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన జీజీ ఎంపీ నిధులతో సీసీ రోడ్డు వేయాలని సర్పంచుకు సూచించారు. ఈ మేరకు సర్పంచు బుధవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరి బ్రహ్మం పర్యవేక్షిస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం



విజేతకు బహుమతి అందజేస్తున్న డిపో మేనేజర్

నంద్యాల టౌన్: ఆర్టీసీ బస్సుల ద్వారానే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నంద్యాల -రుద్రవరం మార్గంలో తిరుగుతున్న 6 బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం విజేతలను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలకు గురికాకుండా సరైన సమయానికి గమ్యస్థానాలు చేర్చడానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని కోరారు. లక్కీ డిప్‌లో రుద్రవరం గ్రామానికి చెందిన పి.కళావతికి మొదటి బహుమతి, ఇదే గ్రామానికి చెందిన వి.శ్రీనివాసులుకు రెండో బహుమతి, నంద్యాల మండలం అయ్యలురు మెట్ట గ్రామానికి చెందిన నరేంద్రకు మూడో దక్కినట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ గ్రామానికి చెందిన గోన దుర్గా ప్రసాద్ అనే యువకుడు కనిపించకుండా పోయాడని ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు వెంకటేశ్వర్లు కుమారుడైన దుర్గాప్రసాద్ నంద్యాలలోని సూర్య స్టోర్‌లో పని చేసేవాడు. దిన చర్యలో భాగంగా ఈ నెల 15న నంద్యాల స్టోర్‌లో పని చేసేందుకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంత వరకు తిరిగి రాలేదని ఆ యువకుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బాధితులకు న్యాయం చేయాలి

గోస్పాడు: పొలం సమస్యపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని తేళ్లపురి గ్రామానికి చెందిన తిరుపతి చిన్ననరసింహులు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాముకు బుధవారం వినతి పత్రం అందజేశారు. చిన్ననరసింహులు మాట్లాడుతూ.. సర్వే నెం.1983లో ప్రభుత్వం తనకు భూమి ఇచ్చిందన్నారు. డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి చెందిన శ్రీరాముల చెన్నయ్య అనే వ్యక్తి పొలాన్ని ఆక్రమించుకున్నాడని వాపోయాడు.

‘ఆరోగ్య సురక్ష’తో ఇంటి వద్దకే వైద్య సేవలు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- కొత్తపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పేదల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తాయన్నారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వైద్య శిబిరాన్ని జనరల్ మెడిసిన్‌తో పాటు వివిధ ప్రత్యేక వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ రెఫరల్, రక్త పరీక్షలు, బీపీ, షుగర్, న్యూట్రిషన్ కౌన్సెలింగ్, తదితర సేవలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందించి ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, ఎంపీటీసీ హరినాథరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలవెంకటరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి



గోడిగనూరు వైద్య శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరులో 342 మందికి వైద్య సేవలు

శిరివెళ్ల: చెన్నూరులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య సేవల కోసం సచివాలయ పరిధిలోని చెన్నూరు, ఇసుకపల్లె, మోత్కులపల్లె గ్రామాల నుంచి ప్రజలు ఉదయాన్నే తరలివచ్చారు. నమోదు కోసం శిబిరం వద్ద బారులు తీరారు. స్పెషలిస్టులు 342 మంది ప్రజలకు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్లు పోషకాహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్ర, డాక్టర్ వెంకటరెడ్డి, సర్పంచు చిట్టిబాబు, మాజీ సర్పంచు మేర్వ నాగభూషంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యం

చాగలమర్రి: మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజల ఇంటి ముంగిటకే వైద్యాన్ని అందించేందుకు అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి విశేష స్పందన లభిస్తోందని జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ షేక్.బాబులాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీ పత్తి నారాయణ అన్నారు. బుధవారం ఎంపీటీసీ పత్తి నారాయణ, ఎంపీడీఓ మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో మండలంలోని గోడిగనూరు గ్రామ ప్రాథమిక పాఠశాల భవనంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 413 మందికి వైద్య సేవలు అందించారు. 28 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, ఐదుగురిని కంటి



చెన్నూరులో ఈసీజీ తీస్తున్న డాక్టర్

శుక్లాల ఆపరేషన్ కోసం ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు ఛీపాటి సంజీవరాయుడు, గోవిందయ్య, ఉప సర్పంచ్ పసల క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



కోటకొండ వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచు వెంకటేష్

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని గ్రామ సర్పంచు డేగాని వెంకటేష్ తెలిపారు. ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదు, పంచాయతీ కార్యదర్శి షాహినూర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటి సర్వేలో 700 టోకెన్లు జారీ చేయగా శిబిరంలో వైద్యులు వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందలు పంపిణీ చేశారు. అలాగే సర్పంచుతో పాటు తహసీల్దారు రవీంద్ర ప్రసాదు చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణి చేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, డీఎల్‌డీఓ జనార్దన్‌రావు పరిశీలించారు. వైద్యాధికారులు కల్పన,జయలక్ష్మి,అమర్నాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఖర్చు చేయని నిధులకు ఎక్స్‌పెండీచర్ బుక్ చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: రెండవ విడత మన బడి నాడు-నేడు పథకం కింద పనులు చేపట్టి, ఖర్చు చేయని నిధులకు ఎక్స్‌పెండీచర్ బుక్ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత ఇంజినీర్లు, ఎంఈఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నాడు-నేడు పనుల ఎక్స్‌పెండీచర్ బుకింగ్, గ్రాస్ ఎన్‌రోల్మెంట్ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత నాడు-నేడు కింద పనులు చేపట్టి 62 ప్రభుత్వ పాఠశాలల్లో ఖర్చు చేయని మొత్తాలకు ఎక్స్‌పెండిచర్ బుక్ చేయాలన్నారు. ప్రతి మండలంలో కచ్చితంగా 4 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తిస్థాయిలో, పూర్తి చేసి ఈ నెలాఖరు లోపు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పనుల ప్రగతిపై ప్రతి రోజు డీఈ, ఏఈలు పర్యవేక్షించి నివేదికలు ఇవ్వాలన్నారు. నిధులకు కొరత లేదని పనులు నాణ్యతతో చేపట్టి, పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు ఎక్స్‌పెండీచర్ బుక్ చేయాలని సూచించారు. అలాగే స్లాబ్ పెండింగ్ ఉన్న 99 అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ నెలాఖరులోపు స్లాబ్ పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్లో పెండింగ్ ఉన్న గ్రాస్ ఎన్‌రోల్మెంట్ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. బడి ఈడు పిల్లల గ్రాస్ ఎన్‌రోల్మెంట్ సర్వే నమోదుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్లాక్ టిక్‌లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

బాల్యవివాహాలతో అనర్థాలు

నంద్యాల(సిటీ): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు వస్తాయని మెప్మా సీఎంఎం(సిటీ మిషన్ మేనేజర్) విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టౌన్ హాల్‌లో మహిళా సంఘాల సభ్యులకు బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. రక్త హీనత, మాతృమరణాలు, చిన్నారుల్లో పోషకలోపం తలెత్తే ప్రమాదం ఉందని చెప్పారు. అనంతరం మహిళలతో బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఓలు శిరీష, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

శిరివెళ్ల: ఇసుకపల్లె చెందిన ఆదెమ్మ గుండెపోటుతో బుధవారం మరణించింది. ఆమెకు వైఎస్సార్ బీమా ఉండటంతో నామినీ సుబ్బమ్మకు తక్షణ సాయంగా రూ.10వేలను సర్పంచ్ చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు మేర్వ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆటో డ్రైవర్లకు పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా నాయకులు శ్రీనివాసులు, అన్వర్, వెంకటేష్‌గౌడ్ కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. వారు మాట్లాడుతూ జీవో నెంబరు 21, 31 రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లందరికీ వాహన మిత్ర పథకం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డీఆర్ఓ పుల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సోమయ్య, శ్రీనివాసులు, శీను, షాకీర్ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యవంతులు చేయడమే లక్ష్యం

నంద్యాల(అర్బన్): ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటూ.. రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేసుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయడమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాయలంలో బుధవారం ఐక్యవేదిక నూతన మండల, జిల్లా కమిటీల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల కనీస అవగాహన, సమాచార హక్కు చట్టం, గ్రామ సభలు, ఎన్నికల విధానాల సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, కోశాధికారి సత్యనారాయణ, మహిళా విభాగం కన్వీనర్ ప్రసన్నకుమారి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల జీవన స్థితిగతులు మెరుగయ్యాయి

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- వీసీ కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నంద్యాల(సిటీ): రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రజల జీవన స్థితిగతులు మెరుగయ్యాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 34వ వార్డు వీసీ కాలనీలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో అన్ని సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చేయుతనిస్తుందని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారం చూపుతామన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ ఇలాంటి సంక్షేమం మరెన్నడూ చూడలేదని చెబుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

పట్టణంలో అభివృద్ధి పనులు

పట్టణంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇలాంటి అభివృద్ధిని మరోమారు ప్రజలు కోరుతున్నారని ఎమ్మెల్యే శిల్పారవి అన్నారు. ప్రతి ఒక్కరి అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. పేదలందరూ తమ సొంత కాళ్లమీద నిలబడేందుకు ఆర్థికంగా చేయూతనిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, పున్నాశేషయ్య, కౌన్సిలర్లు కలాంబాషా, సాదిక్, చంద్రశేఖర్, సమ్మద్, కోఆప్షన్ సభ్యులు సలాముల్లా, నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

బకాయిలు వసూలు చేయకపోతే చర్యలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో 16 మండలాల్లో ఎక్కువ శాతం స్త్రీనిధి ద్వారా ఇచ్చిన రుణాల్లో మొండి బకాయిలు ఉన్నాయని, ఈనెల 31వ తేదీ లోపు వసూలు చేయని పక్షంలో సంబంధిత సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జిల్లాలోని ఏపీఎంలకు, సీసీలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇచ్చిన అప్పులు 100 శాతం రికవరీ అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా వసూలు అయ్యేలా చూడాలన్నారు. వసూలు అయిన రుణాలన్నీ బ్యాంకులో జమ చేస్తున్నారో లేదో పర్యవేక్షణ చేయాలని ఏపీఎంలను, సీసీలను ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా స్త్రీనిధిలో బకాయిలు ఉన్నాయని, త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీపీఎంఐవీ దానం, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆలయాల పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేట శ్రీఆంజనేయస్వామి దేవస్థానం, కోటావీధిలోని రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్, పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం బుధవారం ఈఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. రమాసమతే సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్‌గా యాడికి శ్రీదేవి, ధర్మకర్తల సభ్యులుగా చాటకొండ సత్యనారాయణ, నందవరం లక్ష్మీదేవి, కోనేటి అమ్మని, చిలకల సుధారాణి, పాములపాటి విజయలక్ష్మి, ముల్లుగల్లు వెంకటేశ్వర్లను ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రసన్నకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, పడకండ్ల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో..

ఆలయ చైర్మన్‌గా చెన్నా వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులుగా కాలంగి లక్ష్మి, చిన్నమాతాంగి జంబుగేశ్వరి, ఎర్రగుంట్ల లక్ష్మీదేవి, నల్లబోతుల విజయలక్ష్మి, శ్రీనివాసులు, జయసుబ్బడు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రధాన అర్చకుడు సుబ్బయ్యశర్మలచే దేవాలయ శాఖ తనిఖీ అధికారి శశికుమార్, ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పున్నాశేషయ్య, అవ్వారి గౌరీనాథ్, పబ్బు తులసీకృష్ణ, శ్రీనివాసులు, ఆలయ ఈఓ రామాంజనేయశర్మ పాల్గొన్నారు.



రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు

ప్రాపర్టీ కార్డుతో పూర్తిస్థాయి హక్కులు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి

నంద్యాల(అర్బన్): స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజస్, మ్యాపింగ్ విత్ ఇంప్రోవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) పథకంలో భాగంగా గ్రామ కంఠం పరిధిలోని ఇల్లు, ఖాళీ స్థలాలకు ప్రాపర్టీ కార్డును అందజేస్తామని, దీని ద్వారా పూర్తిస్థాయి హక్కు పత్రం వస్తుందని డీపీఓ మంజులవాణి తెలిపారు. స్వామిత్ర పథకంలో భాగంగా మొదటి విడత కింద జిల్లాలో 11 గ్రామాల సర్వే పూర్తయ్యిందని, రెండో విడతలో 57 గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన, నిర్ధారణ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. బుధవారం నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో జరుగుతున్న పనులకు సబంధించి డ్రోన్ టెక్నాలజీతో ఇళ్లు, స్థలాల మ్యాప్‌ను ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భార్గవి పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కాంగ్రెస్ గెలుపు అవసరం

నంద్యాల(అర్బన్): త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పట్టణ అధ్యక్షుడు చింతలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రతో బీజేపీ పునాదులు కదిలాయన్నారు. పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్‌ఖాన్, ఆనందరావు, చాబోలు సలాం, అజయ్ కుమార్, జావీద్ పాల్గొన్నారు.

భాషా పండిట్‌లకు న్యాయం చేస్తాం

నంద్యాల(న్యూటౌన్): భాషా పండిట్‌లకు పదోన్నతులు కల్పించి న్యాయం చేస్తామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చినట్లు భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదోన్నతులు లేక మిగిలిపోయిన భాషా పండిట్లు ప్రభుత్వ సలహాదారును కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. 2019 నవంబర్‌లో 1,024 పండిట్‌లు, 2,650 పీఈటీలకు పదోన్నతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. అదే సమయంలో అర్హతలో చేసిన మార్పుల వల్ల పదోన్నతులు రాక 1,137మంది పండిట్‌లు అలాగే ఉండిపోయారని చెప్పారు.

ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): ఏ విధమైన గ్యాస్ కనెక్షన్ లేని దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న(ఎస్సీ, ఎస్టీ, బ్యాక్ వర్డ్ క్లాసెస్) ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద ఇస్తున్న ఉచిత గ్యాస్ కనెక్షను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.వెంకటరాముడు తెలిపారు. కనెక్షన్ల జారీకి సంసిద్ధతపై జాయింట్ కలెక్టర్ భారత రంగ ప్రభుత్వ సంస్థలైన భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏరియా సేల్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పేదలకు మొదటి సిలిండర్ ఇచ్చేందుకు ఏరియా సేల్స్ అధికారులు సంసిద్ధతను తెలియజేశారు. అనంతరం డీఎస్ఓ వెంకటరాముడు మాట్లాడుతూ.. కనెక్షన్ల జారీకి ఈకేవైసీ ప్రక్రియ కూడా మొదలు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ పౌర సరఫరాల అధికారి రవిబాబు, నంద్యాల జిల్లా నోడల్ అధికారి యశ్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీమహాలక్ష్మిదేవిగా అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకారంలో..



రుద్రవరంలో ధనలక్ష్మీదేవిగా



ముత్యాలపాడులో శ్రీమినాక్షిదేవి అలంకారం

దుర్గామాత.. దీవించమ్మా



ఆళ్లగడ్డలో ఆకట్టుకున్న క్షీరసాగర మదనం



రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దేవి శరన్నవ రాత్రులను పురస్కరించుకొని నాల్గవ రోజైన బుధవారం పలు దేవాలయాల్లో ఉదయం గణపతి పూజలు, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజలు, రాహుః కాల పూజలు, కంకణ దారణలు, స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, పూలంగిసేవ కార్యక్రమాలు, లలితా సహస్రనామాలు, వేదపారాయణాలు, హోమాలు, గోపూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించి ప్రత్యేక మండపాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అంలకరించారు.

- పట్టణంలోని శ్రీకాళికాంబదేవస్థానంలో అమ్మవారి ఉదయం వెండి ఆభరణాలతో అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక మండపాల్లో అమ్మవారు శ్రీ విజయదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీకొట్టి సుబ్బమ్మ కల్యాణ మండపంలో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో రూ.5లక్షల కరెన్సీ నోట్లతో అంకరించారు.
- బ్రహ్మనందీశ్వరస్వామికి ఉదయన్నే మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పార్వతీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శ్రీమహానందీశ్వర కామేశ్వరి సహిత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీకామాక్షిదేవి, స్కందమాత దేవిగా అలంకరించారు. అనంతరం శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.
- స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మత్స్యవతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మండపంలో ఉత్సవమూర్తికి శ్రీమహాలక్ష్మిదేవిగా అలంకరించారు.
- స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామికి ఉదయం విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. శివాలయంలోని కాశీవిశ్వనాథునికి, కాశీవిషాలాక్షికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక మండపంలో శ్రీ అన్నపూర్ణాదేవిగా, శ్రీ కాశీవిషాలాక్షిదేవిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక తెలుగుపేటలోని శ్రీమద్దిలేటి లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాగౌరీ దేవిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- శ్రీ రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవిని లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- పట్టణంలోని బాల్కొండ హాల్ వీధిలో దుర్గాదేవి విగ్రహాన్ని భక్తులు ఏర్పాటు చేసి సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్మల సత్రం షిర్డీసాయి దేవాలయంలో అమ్మవారు విగ్రహానికి శ్రీలలితాదేవి అలంకారంలో, రెవెన్యూ క్వార్టర్స్ శ్రీమహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.



మత్స్య అలంకారంలో శ్రీవాసవీ మాత

ఆళ్లగడ్డ: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు క్షీరసాగర మదనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవేంద్రుని, ఇంద్రాక్షి సుదర్శన హోమం జరిపారు.

దొర్నిపాడు: శరన్నవరాత్రుల్లో భాగంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు బుధవారం భక్తులకు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఉయ్యాలవాడ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఇంజేడులో చౌడేశ్వరి దేవి అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శిరివెళ్ల: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవీ అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

రుద్రవరం: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలో అమ్మవారు శ్రీ భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.